నేడు నీటి సరఫరా బంద్‌



పెద్దాపూర్‌ వద్ద పైప్‌లైన్‌ పగలంతో లేచిన నీరు

మణికొండ: సింగూరు ప్రాజెక్ట్‌ నుంచి హైదరాబాద్‌ నగరానికి మంచినీటి తరలించే పైప్‌లైన్‌ శుక్రవారం మధ్యాహ్నం శంకర్‌పల్లి మండలం, పెద్దాపూర్‌ వద్ద పగలిపోయిందని జలమండలి మేనేజర్‌ రామకృష్ణారెడ్డి తెలిపారు. దాంతో శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం సాయంత్రం వరకు నీటి సరఫరా అంతరాయం కలుగుతుందని ఆయన వివరించారు. ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని, నీటిని పొదుపుగా వాడాలని ఆయన కోరారు. పైప్‌లైన్‌ పగిలి పోవటంతో నీరు ఉవ్వెత్తున లేచిందని, దాంతో కొంత సమయం నీరు వృథాగా పోయిందని స్థానికులు తెలిపారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శంషాబాద్‌: శంషాబాద్‌ పట్టణంలోని సాతంరాయిలో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల (పురుషులు) డిగ్రీ, లా కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ జె.విరూపాక్ష తెలిపారు. 2025–26వ విద్యాసంవత్సరానికి గాను డిగ్రీలో ప్రవేశించేందుకు ఇంటర్‌ ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ఉస్మానియా విశ్వవిదాలయం నిర్వహించే లాసెట్‌ ద్వారా కూడా లా కోర్సులకు ప్రవేశాలున్నాయన్నారు. విద్యార్థులు నేరుగా అడ్మిషన్‌ పొందేందుకు ఫోన్స్‌: 95736 49993, 98664 74731లలో సంప్రదించాలని సూచించారు.

ట్రాఫిక్‌ పోలీసులకు పదోన్నతులు



పదోన్నతి పొందిన వారితో ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌, ఎస్‌ఐలు

మణికొండ: నార్సింగి ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న ఆరుగురికి పదోన్నతులు లభించాయి. వారికి ప్రమోషన్‌ ఉత్తర్వులతో పాటు హెడ్‌ కానిస్టేబుల్‌ బ్యాడ్జ్‌లను శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ నిరంజన్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్‌ మాట్లాడుతూ... తమ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సత్యకుమార్‌, విద్యాసాగర్‌, శ్రీనివాస్‌, సుదర్శన్‌రెడ్డి, సుధాకర్‌, నరేందర్‌లకు ఒకేసారి పదోన్నతులు రావటం ఎంతో సంతోషం కలిగిందన్నారు. పదోన్నతి పొందిన ఉత్సాహంతో ట్రాఫిక్‌ క్రమబద్ధీకరణతో ప్రజలకు మరింత సేవలు అందించాలన్నారు. ఈ సందర్భంగా వారిని తోటి సిబ్బందితో పాటు ఎస్‌ఐ రాజేష్‌గౌడ్‌ తదితరులు అభినందించారు.

కోట మైసమ్మ ఆలయ అభివృద్ధికి కృషి

రాజేంద్రనగర్‌ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌

రాజేంద్రనగర్‌: బుద్వేల్‌లోని కోట మైసమ్మ దేవాలయాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తానని రాజేంద్రనగర్‌ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ అన్నారు. కోట మైసమ్మ ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఆయనను కలిసి మొదటి వార్షికోత్సవ పూజా కార్యక్రమంలో పాల్గొన్నాలని ఆహ్వాన పత్రాని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కోట మైసమ్మ దేవాలయాన్ని పునర్‌ నిర్మించడం అభినందనీయమన్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ... ఈ నెల 20వ తేదీ దేవాలయ మొదటి వార్షికోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. రాజమహేంద్రవరం దేవి చౌక్‌ ప్రాంతానికి చెదిన లీలా కృష్ణమెహన్‌ రూ. 4.20 లక్షల విలువైన బంగారు అభరణాలను తయారు చేయించారన్నారు. పూజల అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

అత్తాపూర్‌: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన అత్తాపూర్‌ పోలీస్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఈ నెల 8వ తేదీన పిల్లర్‌ నెంబర్‌ 142 వద్ద గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా ఓ 55–60 సంవత్సరాల వ్యక్తి మృతి చెంది ఉన్నాడన్నారు. మృతుడి ఆచూకీ కోసం స్థానికంగా వాకాబు చేసిన ఎలాంటి సమాచారం అందలేదన్నారు. దీంతో పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చరీకి తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజావసరాలకు భూములివ్వండి

బీఆర్‌ఎస్‌ మణికొండ మున్సిపల్‌ అధ్యక్షుడు సీతారాం



సెక్రటేరియట్‌ కాలనీలో పర్యటిస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

మణికొండ: రాష్ట్రంలో ఐటీ పరిశ్రమ విస్తరించటం, లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పించే క్రమంలో మణికొండ మున్సిపాలిటీ, పుప్పాలగూడలో ఐటీ హబ్‌కు 450 ఎకరాల భూములు ఇవ్వటం బాగానే ఉన్నా స్థానికంగా ఉన్న ప్రజల అవసరాలకు తగిన రీతిలో భూములు కేటాయించాలని బీఆర్‌ఎస్‌ పార్టీ మణికొండ మున్సిపల్‌ అధ్యక్షుడు డి. సీతారాం డిమాండ్‌ చేశారు. శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి గుడ్‌ మార్నింగ్‌ మణికొండ కార్యక్రమంలో భాగంగా సెక్రటేరియట్‌ కాలనీలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరిధిలో జీహెచ్‌ఎంసీ కంటే రెండు రెట్లు ఎక్కువ పన్నులు వసూలు చేస్తున్నా సౌకర్యాలు మాత్రం లేవన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు అవసరమైన కూరగాయల మార్కెట్‌, బస్‌ డిపో, అగ్నిమాపక కేంద్రం, జూనియర్‌ కళాశాల, వీధి కుక్కల షెల్టర్‌, తాగునీటి రిజర్వాయర్‌లు, విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ల నిర్మాణాలకు స్థలాల అవసరం ఎంతో ఉందన్నారు. ఆయా శాఖల అధికారులు ఎన్ని సార్లు తమకు స్థలాలు కేటాయించాలని కోరినా ఇవ్వలేక పోతున్నారనే విమర్శలు వస్తున్నాయన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రజావసరాలకు సరిపడా స్థలాలను కేటాయించాలని డిమాండ్‌ చేశారు. సెక్రటేరియట్‌ కాలనీలో వీధి దీపాలు సరిగా వెలగటం లేదని, ఆకతాయి పిల్లలు గంజాయి సేవించి ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతున్నారని, రాత్రి సమయంలో మహిళలు, వృద్ధులు బయటకు వచ్చేందుకు జంకుతున్నారన్నారు. విద్యుత్‌ సరఫరా హెచ్చుతగ్గుల సరఫరాతో గృహోపకరణాలు దెబ్బతింటున్నాయని ప్రజలు వాపోతున్నారన్నారు. బీఆర్‌ఎస్‌ పార్టీ మున్సిపల్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కె.ధన్‌రాజ్‌, ప్రధాన కార్యదర్శి జి.నరేందర్‌, నాయకులు బి.బాబు, మాల్యాద్రి నాయుడు, ఎ.లక్ష్మణ్‌రావు, ఉపేంద్రనాథ్‌రెడ్డి, శ్రీకాంత్‌, కిరణ్‌, మల్లేష్‌, సుమనళిని తదితరులు పాల్గొన్నారు.

మానవ రహిత వ్యవసాయం దిశగా పరిశోధనలు జరిగాలి

వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ అల్దాస్‌ జానయ్య



సీడీలను ఆవిష్కరిస్తున్న వీసీ, అధికారులు

ఏజీవర్సిటీ: పర్యావరణ పరిరక్షణ... మానవ రహిత వ్యవసాయం దిశగా వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశోధనలు చేయాలని ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ అల్దాస్‌ జానయ్య అన్నారు. ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన, విస్తరణ సలహా మండలి 48వ సమావేశం శుక్రవారం వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో జరిగింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ... మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సంస్థలు, వ్యవస్థలూ మారాలన్నారు. సవాళ్లను విజయవంతంగా ఎదుర్కొనేందుకు భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఎప్పటికప్పుడు పునర్‌వ్యవస్థీకరణ చర్యలు చేపడుతున్నదని అన్నారు. ఒకప్పుడు ఆహార భద్రత కోసం అధిక దిగుబడి విధానాలను అవలంబించామన్నారు. అందుకోసం నీటి పారుదల ప్రాజెక్టులు నిర్మించి, ఎరువుల ఫ్యాక్టరీలను విరివిగా స్థాపించామని వీసీ వివరించారు. అందువల్ల నేడు అన్ని ఆహార ధాన్యల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందన్నారు. 1947–50 మధ్య కాలంలో దేశం సాధించిన దిగుబడులను నేడు తెలంగాణ ఒకటే సాధిస్తున్నదన్నారు. మారిన వాతావరణ పరిస్థితులు ఉత్పత్తి పెరుగుదల కారణంగా ప్రస్తుతం కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని వీసీ పేర్కొన్నారు. సహజ వ్యవసాయ పద్ధతులు ఆర్టిఫిషియల్‌ ఇంటలిజెన్స్‌, డ్రోన్లు, రోబోటిక్‌ టెక్నాలజీ వినియోగాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఆ దిశగా పరిశోధనలు సాగాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం, బోధన సిబ్బంది, శాస్త్రవేత్తలు, రైతులు, ఉద్యాన అధికారులు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయం ఎలక్ట్రానిక్‌ విభాగం వివిధ అంశాలపై రూపొందించిన సీడీలను ఆవిష్కరించారు.

బీఆర్‌ఎస్‌ రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి

అత్తాపూర్‌: వరంగల్‌లో ఈ నెల 27న ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న బీఆర్‌ఎస్‌ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాజేంద్రనగర్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అత్తాపూర్‌ డివిజన్‌ బీఆర్‌ఎస్‌ నాయకులు శుక్రవారం కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... బీఆర్‌ఎస్‌ రజతోత్సవ బహిరంగ సభకు పార్టీ నేతలు, కార్యకర్తలు లక్షలాదిగా తరలిరావాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకులు కొలన్‌ సుభాష్‌రెడ్డి, జాలిగం చిత్తారీ, అప్పారెడ్డి ముఖేష్‌, పుప్పాల లక్ష్మణ్‌, జంగయ్య, నరేందర్‌, బి.శ్రీను, మల్లేష్‌, జగన్‌, కష్ణ, చేతన్‌సింగ్‌, గురుమిత్‌సింగ్‌ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. ఉపశమనం



మైలార్‌దేవ్‌పల్లి: ఈదురు గాలులతో శుక్రవారం మధ్యాహ్నం రాజేంద్రనగర్‌ నియోజకవర్గం పరిధిలో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉక్కపోతతో సతమతమైన ప్రజలు ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ఉపశమనం పొందారు. ఈదురు గాలుల కారణంగా ఆయా ప్రాంతాలలో విద్యుత్‌ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్‌ తీగలపై రాజేంద్రనగర్‌, ఉప్పర్‌పల్లి, శివరాంపల్లి ప్రాంతాల్లో చెట్లకొమ్మలు విరిగి పడటంతో సరఫరా నిలిచిపోయింది. అలాగే ఈదురు గాలుల కారణంగా విద్యుత్‌ వైర్లు ఒకదానికి ఒకటి తగలడంతో సరఫరా నిలిచిపోయింది. సిబ్బంది స్పందించి సరఫరాను పునరుద్ధరించారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలలో వరద నీరు నిలిచిపోయింది. పాదచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు.

ఈదురు గాలులతో...

మణికొండ: రోజంతా ఎండ, ఉక్క పోతతో ఉన్న వాతావరణం సాయంత్రానికి మారిపోయి భారీ ఈదురు గాలులతో కూడిన ఓ మోస్తారు వర్షం కురిసింది. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయి పెద్ద ఎత్తున ఈదురు గాలులు వీచాయి. ఆ తరువాత ఓ మోస్తారు వర్షం కురిసింది. ఈదురు గాలులలకు కొన్ని చోట్ల విద్యుత్‌ వైర్లు ఒకదానికి మరొకటి తగలటంతో సరఫరా నిలిచిపోయింది. గాలులు తగ్గాక సరఫరాను పునరుద్ధరించారు. కోకాపేటలోని పలు నిర్మాణ సంస్థల వద్ద భారీ గాలులకు రేకులు, ఇతర వస్తువులు లేచిపోయాయి. దుమ్ము, ధూళి లేవటంతో తుపాను వాతావరణం నెలకొందని స్థానికులు తెలిపారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాలకు చెక్‌

అత్తాపూర్‌: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని రాజేంద్రనగర్‌ ఫైర్‌ స్టేషన్‌ ఆఫీసర్‌ చంద్రానాయక్‌ అన్నారు. శుక్రవారం సర్కిల్‌ పరిధిలోని పలు ప్రాంతాల్లో అవగాహన కల్పించారు. హాస్పిటల్స్‌, అపార్ట్‌మెంట్స్‌, గృహ సముదయాలు, హోటల్స్‌ ఇతర ప్రాంతాలల్లో అత్యవసర పరిస్థితుల్లో ప్రమాదాలు ఏర్పడినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని అనేదానిపై వివరించారు. వేసవిలో ప్రతిక్షణం అప్రమత్తంగా ఉంటే అగ్నిప్రమాదాలను విజయవంతంగా నివారించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ అగ్నిమాపక సాధనాలను తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు.

దొంగిలించిన ఫోన్లు కొనాలని వ్యాపారిపై దాడి

అత్తాపూర్‌: తాము దొంగిలించిన ఫోన్లను కొనాలని డిమాండ్‌ చేస్తూ ఐస్‌క్రీమ్‌ వ్యాపారిపై దాడి చేసిన సంఘటన అత్తాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ నాగేశ్వరరావు సమాచారం మేరకు... ఉత్తరప్రదేశ్‌ రాష్ట్రానికి చెందిన అనూజ్‌(23) కుటుంబ సభ్యులతో కలిసి అత్తాపూర్‌ గురుద్వార్‌ సమీపంలో ఉంటున్నాడు. కొంత కాలంగా కుల్ఫీ ఐస్‌ క్రీమ్‌ బిజినెస్‌ చేసుకుంటూ కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. గురువారం రాత్రి నౌనెంబర్‌ ప్రాంతానికి చెందిన పాన్‌షాప్‌లో బీడీ కట్ట కొనుక్కునేందుకు వెళ్లాడు. అక్కడే ఉన్న అఫ్రోజ్‌(20), సల్మాన్‌(20), కొంగరి క్రాంతి(23)లు తమ వద్ద ఉన్న ఫోన్‌లు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేసి దాడి చేశారు. ఒక్కసారిగా జరిగిన సంఘటనతో భయాందోళనకు గురైన ఆనూజ్‌ స్థానికంగా ఉన్న రామకృష్ణ జువెలర్స్‌లోకి పరిగెత్తాడు. అతన్ని వెంబడించిన ముగ్గురు దాడి చేశారు. దాడిలో అనూజ్‌ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



శంషాబాద్‌: వేళంగని కాలనీలో గుడ్‌ఫ్రైడే వేడుకలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏసు క్రీస్తు శిలువ మోసే ఘట్టంపై వేసిన నాటకాన్ని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ఏసు క్రీస్తు శిలువతో మరణించిన కారణంగానే లోకానికి రక్షణ వచ్చిందని ఫాదర్‌ జాన్‌పాల్‌ తెలిపారు. ఏసు క్రీస్తు శిలువధారిగా సంపత్‌రెడ్డి ఎంతగానో అలరించారు.

‘తల్లిదండ్రులను ఇంట్లోకి రానిస్తాం’

- తల్లి, అక్క మంత్రాలు చేయించారు
- దేవాలయంలో ప్రమాణం చేయాలి
- వృద్ధ దంపతులు బాలమల్లయ్య, శారదల కుమారులు



క్షుద్రపూజల చిత్రాలను చూపుతున్న బాలరాజు, శివకుమార్‌ దంపతులు

సాక్షి ఎఫెక్ట్‌..

మణికొండ: మంత్రాలు చేసి తమ కుమారుడి మృతికి కారణమయ్యారనే కోపంతో తల్లితండ్రులను ఇంట్లోంచి వెళ్లగొట్టిన కొడుకులు దిగి వచ్చారు. వారి ఇంటికి వారు రావచ్చని, తమ అమ్మ, అక్కలు మంత్రాలు చేసింది మాత్రం నిజమని, అందుకు తగ్గ సాక్ష్యాలు తమ వద్ద ఫొటోలు, వీడియోల రూపంలో ఉన్నాయని వారు వాదిస్తున్నారు. సాక్ష్యాల ఆధారంగా అపుడే నార్సింగి పోలీసులకు తాము ఫిర్యాదు చేశామని తెలిపారు. గురువారం ‘సాక్షి’ దినపత్రికలో ‘మంత్రాల నెపంతో గెంటేశారు’ అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి వృద్ధుల కుమారులు స్పందించారు. శుక్రవారం వారి నివాసంలో ‘సాక్షి’తో మాట్లాడుతూ... తమ తల్లితండ్రులు ఇంట్లో ఉండొద్దని తాము భావించటం లేదన్నారు. గ్రౌండ్‌ ఫ్లోర్‌లో వారు ఉంటున్న ఇంట్లో, ఇంటి ముందు కొన్ని యంత్రాలు, పేర్లు, తమ ఫొటోలను నిమ్మకాయలు, పసుపు, కుంకుమలతో కలిపి పాతిపెట్టారన్నారు. ఆ విషయం తమ ఇంటి చుట్టుపక్కల వారితో పాటు గ్రామ నాయకులు వచ్చి చూశారన్నారు. ఎలాంటి అనారోగ్యం లేకుండానే ఒక రోజు వ్యవధిలోనే తన కుమారుడు మృతి చెందటంతో తమ అనుమానాలు మరింత పెరిగాయని వృద్ధ దంపతులు బాలమల్లయ్య, శారదల కుమారుడు బాలరాజు అన్నారు. తమ అక్క, తమ అమ్మతో ఇవ్వన్నీ చేయించిందని, తండ్రికి ఏపాపం తెలియదన్నారు. వారు ఫిర్యాదులు చేసిన ఆర్‌డీఓ, తహసీల్దార్‌, పోలీసులకు తమ వద్ద ఉన్న ఆధారాలతో వాదనను వినిపించామన్నారు. వారి పింఛన్‌ డబ్బులు, అద్దె డబ్బులు తాము ఒక్క రూపాయి తీసుకోలేదని, తమ అక్కకే రూ. 5 లక్షలు ఇచ్చారన్నారు. పింఛన్‌ పత్రాలను రెన్యువల్‌ చేయించేందుకే తీసుకున్నామని, పింఛన్‌ డబ్బులు అకౌంట్‌లో పడతాయని, తమ తండ్రి వెళ్తేనే ఇస్తారని స్పష్టం చేశారు. వారు ఎపుడు వచ్చినా ముందుగా గుడిలో తమపై ఎలాంటి క్షుద్ర పూజలు చేయలేదని ప్రమాణం చేస్తే తమకు ఉన్న అనుమానాలు పోతాయని వారి ఇద్దరి కుమారులు, కోడళ్లు స్పష్టం చేశారు.

దళితరత్న అవార్డుల ప్రదానం



రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ సర్కిల్‌కు చెందిన దళిత నాయకులు శుక్రవారం రాష్ట్ర శాసనసభ స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌ కుమార్‌ను కలిసి దళితరత్న పురస్కారాలను అందజేశారు. రాజేంద్రనగర్‌కు చెందిన దళిత నాయకులు సంఘ సేవకుడు పంబాల జనార్దన్‌, దాసరి సత్యనారాయణ, ఎస్‌.లక్ష్మణ్‌రావు, తోట హరినర్సింహ, మల్లపల్లి శ్రీశైలం, పత్యర నర్సింహాలను ఘనంగా సన్మానించి అవార్డులను ప్రదానం చేశారు. డాక్టర్‌ బి.ఆర్‌.అంబేడ్కర్‌ జయంతిని పురస్కరించుకొని ఏటా దళిత రత్న అవార్డులను ప్రదానం చేస్తారు. అందులో భాగంగా ఈ సంవత్సరం పురస్కారాలను నగరంలోని తన నివాసంలో స్పీకర్‌ అవార్డులను ప్రదానం చేశారు. దళిత రత్న అవార్డు గ్రహీత, జనార్ధన్‌ మాట్లాడుతూ... ప్రభుత్వం తనకు అవార్డు ఇవ్వడం అనందంగా ఉందన్నారు. యువ నాయకుడు రజనీకాంత్‌గౌడ్‌, వరి లలిత్‌, పత్యార రాజు, వేము వందనం, గొడుగు సంజీవ, కొత్తపల్లి సంతోష్‌, మల్కారం ప్రసాద్‌ పాల్గొన్నారు.

గుంతలను పూడ్చరా?



మహబూబ్‌నగర్‌, హసన్‌నగర్‌ రోడ్లపై గుంతలు, మట్టి



శాస్త్రిపురం: తాగు నీటి పైప్‌లైన్‌ల మరమ్మతుల కోసం గుంతలు తీశారు. అయితే వాటిని పూడ్చకపోవడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. రాజేంద్రనగర్‌ సర్కిల్‌ శాస్త్రీపురం డివిజన్‌ పరిధిలోని మహబూబ్‌నగర్‌, హసన్‌నగర్‌లలోని పలు ప్రాంతాల్లో పైప్‌లైన్‌ మరమ్మతులలో భాగంగా మ్యాన్‌ హోళ్లను ఓపెన్‌ చేసి ఆ కార్యక్రమాలను పూర్తిచేశారు. తవ్విన గుంతలను మాత్రం పూడ్చలేదు. రహదారులపై ఉన్న మట్టి కుప్పల కారణంగా తరచూ ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెప్పిన మీరాలం జలమండలి అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా ఆయా సమస్యలపై ఫిర్యాదులు చేస్తున్నా స్పందించడం లేదంటున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే తప్ప అధికారులు గుంతలను పూడ్చరా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా జలమండలి అధికారులు చర్యలు తీసుకొని మ్యాన్‌హోళ్ల వద్ద గుంతలను పూడ్చాలని కోరుతున్నారు.

‘జై బాపు, జై భీమ్‌ జై సంవిధాన్‌’ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లిలోని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ నివాసంలో శుక్రవారం నాయకులతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జై బాపూ, జై భీమ్‌ జై సంవిధాన్‌ కార్యక్రమానికి సంబంధించిన షెడ్యూల్‌ రూపొందించాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. అందరూ కలిసికట్టుగా ఉండి సమావేశాలను విజయవంతం చేయాలన్నారు. శనివారం నుంచి రాజేంద్రనగర్‌, శంషాబాద్‌, గండిపేట మండలాల్లో జై బాపు జై భీమ్‌ జై సంవిధాన్‌ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న పీఏసీఎస్‌ చైర్మన్‌ రాందాస్‌ ముదిరాజ్‌

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని జాతీయ రహదారి పీరంచెరువు కమాన్‌ సమీపాన ధ్యాన్యమనో ప్రస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పీఏసీఎస్‌ చైర్మన్‌ బొర్రా రాందాస్‌ ముదిరాజ్‌ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గడచిన పదహారేళ్లుగా ధ్యాన్యమనో ప్రస్థానం ఆధ్వర్యంలో చలివేంద్ర కేంద్రాలు ఏర్పాటు చేస్తుండటం అభినందనీయం అన్నారు. శుక్రవారం తెలుగు రాష్ట్రాలలోని ప్రధాన కూడళ్లల్లో మొత్తం 25 చలివేంద్రాలను ప్రారంభించాని వెల్లడించారు. వేసవిలో ఎండల తీవ్రత రోజురోజుకూ అధికం అవుతున్న నేపథ్యంలో పాదచారుల, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు ఆధ్యాత్మిక విశ్వగురువు, సైంటిఫిక్‌ యోగి శ్రీ గురు విశ్వస్ఫూర్తి దివ్య ఆశీస్సులతో చలివేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆయా చలివేంద్రాలను బాటసారులు, వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు. స్థానిక నేతలు, నిర్వాహకులు కేశవ నాయుడు, గోపాలకృష్ణ, సూర్యనారాయణ, రాజేష్‌ముదిరాజ్‌, సరోజిని, ఇమాం సాహెబ్‌, సంతోష్‌గౌడ్‌, జగదీష్‌ ముదిరాజ్‌, సత్యవతి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌నే నమ్ముకున్నాం.. న్యాయం చేయండి...

మీనాక్షి నటరాజన్‌ను కోరిన మణికొండ నాయకులు



మీనాక్షి నటరాజన్‌ను కలిసిన మణికొండ కాంగ్రెస్‌ నాయకులు

మణికొండ: దశాబ్దకాలంపాటు బీఆర్‌ఎస్‌ నిరంకుశ పాలనకు ఎదురొడ్డి నిలబడి కాంగ్రెస్‌ పార్టీ పటిష్టతకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు న్యాయం చేయాలని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్‌ను మణికొండ మున్సిపాలిటీ కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు జితేందర్‌, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కిరణ్‌కుమార్‌ కోరారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆమెను, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించామని వారు వెల్లడించారు. పార్టీకి కష్ట కాలంలో అండగా ఉన్న వారికి నామినేటెడ్‌ పదవులు ఇవ్వాలని కోరామన్నారు. లేదంటే రాబోయే రోజుల్లో పార్టీకి నాయకులు, కార్యకర్తలు దూరం అయ్యే పరిస్థితి వస్తుందని వివరించామన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కె. నరేందర్‌ ముదిరాజ్‌ ఆధ్వర్యంలో కష్టపడి పనిచేశామన్నారు. గత ఎన్నికలలో నియోజకవర్గంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సి ఉందని, వాటిని త్వరగా మంజూరు చేయాలని కోరామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ మున్సిపాలిటీ మైనార్టీ అధ్యక్షుడు హాజీ తదితరులు పాల్గొన్నారు.

మూగ జీవులను ఆదుకోండి

రాజస్థాన్‌ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ లక్ష్మణ్‌



పార్కులో నీటి తొట్టెలు, వాటర్‌ పాట్స్‌ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

అత్తాపూర్‌: మండే ఎండల నేపథ్యంలో పిట్టలకు, ఇతర మూగ జీవాలకు చల్లని నీటిని అందించే కార్యక్రమాన్ని అత్తాపూర్‌ డివిజన్‌ చింతకుంట పార్క్‌ వాకర్స్‌ శ్రీకారం చుట్టారు. రాజస్థాన్‌ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ ఎం.లక్ష్మణ్‌ శుక్రవారం ఉదయం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎండాకాలంలో పక్షులు, ఇతర ప్రాణుల దాహార్తిని తీర్చడానికి వాకర్స్‌ స్వచ్ఛందంగా నీటి తొట్టెలు, వాటర్‌ పాట్స్‌, విస్తృతంగా ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన ప్రశంసించారు. పర్యావరణ పరిరక్షణవంటి, వన్యప్రాణుల సంరక్షణ వంటి స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాలకు పౌర సమాజం సహకరించాలని పిలుపునిచ్చారు. సామాజిక కార్యకర్త మధుసూదన్‌ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రజా సంఘాల ప్రతినిధులు, వాకర్స్‌ నల్లింగ్‌ రమేష్‌, సుబ్బరాజు, జైతారం జగన్మోహన్‌రెడ్డి, నర్సింహులు, బిట్యాకి సతీష్‌, సురేందర్‌, మల్లేష్‌, గణేష్‌, ఎం.సుధాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

మణికొండ: కొత్త సర్వీసులు విడుదల, మెయింటెనెన్స్‌ పనులు చేపడుతున్నందున శనివారం పలు సబ్‌స్టేషన్‌లు, ఫీడర్‌ల పరిధిలో నిర్ణీత సమయంలో విద్యుత్‌ సరఫరాను నిలిపివేయనున్నట్లు మణికొండ, నార్సింగి ఏఈలు సంతోష్‌కుమార్‌, మణికంఠ తెలిపారు.

- మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మై స్కేప్‌ ఫీడర్‌ పరిధిలో ఉదయం 9 నుంచి 9.30 గంటల వరకు, అలకాపూర్‌ టౌన్‌షిప్‌ రోడ్డు నెంబర్‌ 13 నుంచి 22 వరకు, 25లలో ఉదయం 10 నుంచి 10.30 గంటల వరకు, శ్రీరాంనగర్‌ కాలనీ, విజేత వెనుకవైపు కాలనీలలో మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు విద్యుత్‌ ఉండదని ఏఈ తెలిపారు. హనుమాన్‌నగర్‌, శివపురి కాలనీ, ఫ్లెజెంట్‌ వ్యాలీ, శ్రీనివాస కాలనీలలో ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తామన్నారు.
- అలకాపూర్‌ రోడ్డు నెంబర్‌ 1,2 సెక్టార్‌ 2ఎ,2బి, 2సి, ఆదిత్య ఫోర్ట్‌ విల్లాస్‌, శివాలయం ప్రాంతాలలో ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు, గోగ్రీన్‌ కాలనీ, తుల్జారాం దేవాలయం వెనుక, అలకాపూర్‌ రోడ్డు నెంబర్‌ 23, 25 నుంచి 30 వరకు సెక్టార్‌ 4లలో సాయంత్రం 4.30 నుంచి 5 గంటల వరకు, బీఆర్‌సీ, సాయిచంద్ర కాలనీ, వినాయక్‌నగర్‌ ఫేజ్‌-1, అంజలిగార్డన్‌, ఎల్‌ఐసీ కాలనీ, సంతోష్‌నగర్‌, న్యూ లక్ష్మీనగర్‌ కాలనీలలో మధ్యాహ్నం 3.30 నుంచి 4 గంటల వరకు విద్యుత్‌ ఉండదన్నారు. భాగ్యలక్ష్మి కాలనీ, హుడా కాలనీ, ఫ్రెండ్స్‌ కాలనీ, తులీప్‌గార్డన్‌ కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

నార్సింగి పరిధిలో...

- మణికొండ మున్సిపాలిటీ, నార్సింగి విద్యుత్‌ ఏఈ పరిధిలోని వైఎస్సార్‌ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, పాష కాలనీ, అలిజాపూర్‌, ఈవీవీ కాలనీ, ఫెయిర్‌ఫీల్డ్‌ కాలనీ, ఇబ్రహీంబాగ్‌లలో ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు కొంత ప్రాంతం, తిరిగి మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు మరికొంత ప్రాంతం విద్యుత్‌ సరఫరా ఉండదని ఏఈ మణికంఠ తెలిపారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని గండిపేట, శ్రీనగర్‌, గ్రేహౌండ్స్‌ ప్రాంతాలలో ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు, బృందావన్‌ కాలనీలో సాయంత్రం 4 నుంచి 4.30 గంటల వరకు, గిరిగిరి గడ్డ, నార్సింగి గ్రామం, ముప్పా విల్లాస్‌, ముప్పా అలేఖ్య ప్రాంతాలలో ఉదయం 10 నుంచి 10.30గంటల వరకు విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తామని వివరించారు. నార్సింగి హైట్స్‌, నార్సింగి గ్రామం, క్యూబా కాలనీ, క్వాస్సా కాలనీ, వివేకానందనగర్‌ కాలనీలలో మధ్యాహ్నం 3.30 నుంచి 4 గంటల వరకు విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు.